క్లుప్తంగా

బాధితుడికి ఆర్థికసాయం

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన సత్తన్న అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆపరేషన్‌కు డబ్బులు లేకపోవడంతో 'జై జవాన్..జై కిసాన్ ఫౌండేషన్' సభ్యులు బుధవారం సత్తన్నకు తన ఇంటి వద్ద రూ ఐదువేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాలకాని గంగాధర్, ఆర్సం మహేశ్, దావన పెల్లి శేఖర్, పోకవేని మల్లేశ్, కొద్ర మల్లయ్య తదితరులు ఉన్నారు.

నేడు ర్యాలీ

ఖానాపూర్: ఓటరు దినోత్సవం సందర్భంగా ఖానాపూర్‌లో గురువారం ర్యాలీ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పరిమళ్ భౌమిక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వెంట సాగే ర్యాలీని విజయవంతం చేసేందుకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పూర్వవిద్యార్థి విరాళం



సామగ్రితో పాఠశాల ఉపాధ్యాయులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1978–79లో పదో తరగతి పూర్తి చేసిన వట్టోలి నివాసి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం రూ.56,500 విలువైన మైక్‌సెట్, సౌండ్‌బాక్స్, ఆంప్లీఫైయర్‌ను పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రి(మలక్‌పేట్)లో క్యాన్సర్ వైద్యుడిగా సేవలు అందిస్తున్నారు. వారికి ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావ్

భైంసారూరల్: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని దేగాం గ్రామంలో పవార్ అనసూయబాయి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. మొదటి బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోలంకి భీంరావు, పండిత్‌రావు, రమణారావు, వెంగల్‌రావు తదితరులు ఉన్నారు.

'ఉపాధి'లో సామాజిక తనిఖీ ప్రారంభం



సత్తనపల్లిలో పరిశీలిస్తున్న తనిఖీ బృందం

ఖానాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కిందట చేపట్టిన పనులను పరిశీలించే సామాజిక తనిఖీ ప్రక్రియ మండలంలో ప్రారంభమైంది. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తూ తనిఖీ బృందంలో ఉన్న 13 మంది డీఆర్పీలు, వీఆర్పీ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. ఎస్‌ఆర్పీ తిరుపతి, ఏపీవో రమేశ్ ఆధ్వర్యంలో పని ప్రాంతాల్లో కొలతలు తీసుకొని కూలీలను అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. తనిఖీలతోపాటు గ్రామసభల అనంతరం ఈనెల 31న సామాజిక తనిఖీపై ప్రజావేదిక ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

నేతాజీ జయంతి రోజు సెలవు ప్రకటించాలి



పూలమాల వేస్తున్న ఏఐఎస్‌బీ నాయకులు

భైంసాటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి రోజు సెలవుగా ప్రకటించాలని ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు జవారే రాహుల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతాజీ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు బీజేపీ ప్రభుత్వం నేతాజీ జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

రేగుపండ్ల సాగుతో లాభాలు

- ఇతరులకు ఆదర్శంగా పీచర రైతు
- చేను వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ఖర్చులు పోను ఎకరాకు రూ.లక్షకు పైనే ఆదాయం



విక్రయించేందుకు తెంపిన పండ్లు



రైతు సాగు చేస్తున్న రేగుపండ్ల తోట

లక్ష్మణచాంద: ఎప్పుడు ఒకే రకమైన పంటలు సాగు చేయకుండా.. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి వ్యవసాయంలో నూతన పద్ధతులను అవలంబిస్తే మంచి లాభాలు పొందవచ్చు. వ్యవసాయం అంటే దండగ కాదని.. వ్యవసాయాధికారుల సూచనలు, మెలకువలు పాటిస్తే పండుగేనని నిరూపిస్తున్నాడు లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామానికి చెందిన బుర్రి గణేశ్. వనరులను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నాడు. తక్కువ పెట్టుబడితో వాణిజ్య పంట అయిన రేగు పండ్ల తోటను సాగు చేస్తూ లాభాలు పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

నాలుగున్నర ఎకరాల్లో సాగు..

లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామానికి చెందిన బుర్రి గణేశ్ తనకున్న దాంట్లో నాలుగున్నర ఎకరాల్లో రేగు పండ్ల తోట సాగు చేస్తున్నాడు. ఎనిమిది నెలల కిందట భద్రాచలం నుంచి కశ్మీర్ ఆపిల్ రకానికి చెందిన రేగుపండ్ల మొక్కలను తెప్పించుకున్నారు. ఒక్కో మొక్కకు రూ.70 వెచ్చించి (ఎకరాకు 350 చొప్పున) నాలుగున్నర ఎకరాలకు 1575 మొక్కలను రూ.1,10,250 (లక్షా పది వేల రెండు వందల యాభై) చెల్లించి తెప్పించుకున్నాడు.

ఎకరాకు పెట్టుబడి రూ.50వేలు..

ఎకరంలో నాటే 350 మొక్కలకు రూ.24,500, మందులకు కలిపి మొత్తం రూ.50వేల వరకు ఖర్చు అయింది. ఎకరాకు పెట్టుబడి రూ.50వేలు పోను ఆదాయం రూ.లక్ష నుంచి రూ.లక్షా యాభై వేల వరకు వచ్చినట్లు రైతు తెలిపారు. పంట వచ్చిన తర్వాత కొమ్మలు కత్తిరిస్తానని పేర్కొన్నారు.

చేను వద్దే అమ్మకం..

సాగు చేసిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్లే అవసరం లేకుండా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పలువురు పండ్ల వ్యాపారులు చేను వద్దకే వచ్చి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. ఒక చెట్టుకు సుమారు బుట్ట పండ్లు వస్తున్నాయని.. బుట్టకు రూ.500 నుంచి రూ.600 వరకు కొంటున్నారు. రోజుకు సుమారు 10 నుంచి 30 బుట్టలను విక్రయిస్తున్నామని.. దీంతో రూ.18వేల వరకు ఆదాయం వస్తుందని రైతు వివరించాడు.

వ్యవసాయాధికారుల సూచనలతోనే..



వ్యవసాయాధికారుల సూచనలతోనే భద్రాచలం నుంచి రేగుపండ్ల మొక్కలు తెచ్చి సాగు చేస్తున్నా. ఇతర పంటలతో పోలిస్తే దీనికి తక్కువ పెట్టుబడులు అవసరం అవుతాయి. ఎకరాకు పెట్టుబడి రూ. 50 వేలు పోను రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు మిగులుతోంది. వచ్చే ఏడాది ఖర్చులు ఇంకా తగ్గుతాయి. – బుర్రి గణేశ్, పీచర

ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రైతుల సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలి
- భైంసా మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రామారావ్ పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసారూరల్: మండలంలోని సాగునీటి ప్రాజెక్టులపై ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. బుధవారం ఎంపీపీ అబ్దుల్ రజాక్ అధ్యక్షతన నిర్వహించిన భైంసా మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న సిరాల, గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువలతోపాటు ఇతర ప్రాజెక్టులకు మరమ్మతులు చేయాలన్నారు.

విద్యుత్ అధికారులు సైతం కరెంట్ సమస్యలు రానీయొద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో స్థానికంగా పీజీ పూర్తి చేసిన వారిని వలంటీర్లుగా నియమించి విద్యార్థుల చదువు నష్టపోకుండా చూడాలని గ్రామాభివృద్ధి కమిటీలకు సూచించారు.

అబ్కారీ శాఖ అధికారులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాలని తెలిపారు.

మండలంలో రోడ్డు సౌకర్యమున్న అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచేలా ప్రభుత్వంతో మాట్లాడుతామన్నారు. అన్ని శాఖల్లోని అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎంపీటీసీలు, సర్పంచులు సన్మానించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ నర్సారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్

తానూరు: గ్రామాల్లో మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి.. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో క్లోరినేషన్ నీటిని అందించడంతోపాటు వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నర్సరీ నిర్వహణ పట్ల నిర్లక్ష్యం చేయవద్దన్నారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ప్రారంభించి కూలీలకు పనులు కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

కుంటాల: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో హరితహారం, ఉపాధిహామీ, పారిశుధ్యం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. సమావేశంలో డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్తపరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కళాశాలలో బుధవారం ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థినులకు హిమోగ్లోబిన్ రక్తపరీక్షలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధనరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా రక్తపరీక్ష చేయించుకోవాలన్నారు. రక్తహీనత ఉన్నట్లు నిర్ధారణ అయితే సిబ్బంది ఇచ్చే మందులను వినియోగించాలని సూచించారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చి ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ నయనారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గంగాశంకర్, సీహెచ్‌ఓ గిరిబాబు, ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోషకులకు ఆటల పోటీలు

నిర్మల్‌రూరల్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలలో బుధవారం పోషకులకు ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నల్ల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి తమ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఒలింపిక్ కమిటీ జిల్లా చైర్మన్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ నిత్యం వివిధ పనులతో బిజీగా ఉండే విద్యార్థుల తల్లిదండ్రులకు ఇలాంటి ఆటలతో మానసిక ఆనందం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదర్మాట్.. సాగు జోరు



ఖానాపూర్: సదర్మాట్ ఆయకట్టుకు ఈనెల 4 నుంచి సాగునీటిని విడుదల చేయడంతో యాసంగి పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే వరి, మొక్కజొన్న, నువ్వులు, ఆవాల పంటలను సాగు చేస్తున్నారు. బుధవారం మండలంలోని గోసంపల్లిలో వరినాట్లు వేస్తున్న దృశ్యమిది.

సన్మానం

కుంటాల: పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని సర్పంచ్ దాసరి కిషన్ పేర్కొన్నారు. మండలంలోని అందాకూర్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు చింతల గంగాధర్ పదవీ విరమణ చేయగా.. బుధవారం అతడిని సన్మానించారు. ఆయన స్థానంలో ముద్ద రాజును నియమిస్తూ గ్రామపంచాయతీ సభ్యులు తీర్మానం చేశారు. పంచాయతీ కార్యదర్శి రమ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన నాయకులు

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం రాష్ట్ర స్పీకర్‌ను మండలంలోని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, అడ్వాల రమేశ్ స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శివభక్తుల మాలధారణ

కుంటాల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సూర్యాపూర్, రాజాపూర్ గ్రామాల్లో పలువురు బుధవారం శివమాల ధారణ చేశారు. బాసరలో గోదావరి నదిలో పుణ్య స్నానం అంతనం సరస్వతి అమ్మవారిని దర్శించుకుని మాలధారణ చేసినట్లు భక్తులు తెలిపారు. నియమ నిష్ఠలతో శివరాత్రి వరకు(41 రోజుల పాటు) దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

సామాన్యుడి ఆయుధం ఓటుహక్కు



ఓటు వేస్తున్న విద్యార్థిని

నిర్మల్‌రూరల్: ప్రజాస్వామ్య దేశంలో సామాన్యుడి ఆయుధమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.భీమ్‌రావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. అనంతరం నమూనా ఎన్నికలు నిర్వహించారు. కొందరు విద్యార్థులు ఎన్నికల అధికారులుగా, మరికొందరు ఓటర్లుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అతిక్, పి.జి రెడ్డి, నాగేశ్వర్, రవీందర్, ఆఫ్రిన్, మురళీధర్ తదితరులున్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- ఐసీడీఎస్ సీడీపీవో సరిత



ఇంకరిగూడెంలో రికార్డులు పరిశీలిస్తున్న సరిత

ఖానాపూర్: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించి కేంద్రాలకు హాజరుకావాలని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. బుధవారం మండలంలోని రాజురా పంచాయతీ పరిధిలోని ఇంకరిగూడెం, బిల్యానాయక్‌తండా, బావాపూర్(ఆర్), దేశ్యానాయక్ తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించడంతోపాటు రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట సూపర్‌వైజర్ శ్రీలత తదితరులు ఉన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: బీఆర్‌ఎస్ అధికారంలో లేదని కార్యకర్తలు అధైర్యపడొద్దని..అన్ని వేళలా అండగా ఉంటూ ప్రజాసేవ చేస్తానని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పిప్రి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుదామని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, మండల కన్వీనర్ శ్యాంసుందర్, రత్నాకర్‌రావు, భుజంగ్‌రావు, ముత్తగౌడ్, నర్సయ్య, కపిల్, సాయన్న, దత్తుపటేల్, దిగంబర్, వెంకట్‌రావు, గంగాధర్, భీంరావు, ముత్తన్న, అనిల్, ఉత్తంలు ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి



కుభీర్‌లో మాట్లాడుతున్న కవిత

కుభీర్:బాలికలు ఆత్మవిశ్వాసంతో చదివి అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూ రిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.వాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పార్‌పెల్లిలో..

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జీవశాస్త్రం ఉపాధ్యాయుడు గంగ సురేశ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలురతో సమానంగా బాలికలను చదివించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహకారంతో నిర్మల్ అభివృద్ధి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



శ్రీహరిరావుతో పార్టీలో చేరిన నాయకులు

మామడ: నిర్మల్ నియోజకవర్గాన్ని సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని కొరిటికల్, ఆదర్శనగర్ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్‌లో చేరారు. కొరిటికల్ ఎంపీటీసీ సౌజన్య రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి, ఆదర్శనగర్ సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డికి శ్రీహరిరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సదరం క్యాంపు సద్వినియోగం చేసుకోండి

సోన్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న దివ్యాంగులు సదరం ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్తే వైద్యులు కేటగిరిలను నిర్ధారిస్తారని పేర్కొన్నారు. వైద్యులిచ్చే పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అప్పగించాలని సూచించారు. సదరు కాపీలను ఈనెల 29లోగా నిర్మల్‌లోని డీఆర్డీవో కార్యాలయానికి పంపించాలని కార్యదర్శులకు సూచించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



భైంసాలో కాంగ్రెస్‌లో చేరిన బాసర నాయకులు

లోకేశ్వరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కన్కపూర్ సర్పంచ్ సలాయి నరేశ్, బిలోలికు చెందిన నర్సింగ్‌రావు, అబ్దుల్లాపూర్‌కు చెందిన రాజారెడ్డి, రాయపూర్‌కాండ్లీకి చెందిన సుదర్శన్, రత్నయ్య, దేవన్న, ఉసేన్, నర్సారెడ్డి, కిష్టాపూర్‌కు చెందిన సుధీర్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ భైంసాలోని తన నివాసంలో కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వారికి సూచించారు.

బాసర నుంచి..

భైంసా: బాసరకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం భైంసాలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జంగం రమేశ్, బాశెట్టి శ్యామ్, కర్నె ప్రభాకర్, సాయిలు తదితరులున్నారు.

ఆటోల్లో పరిమితికి మించి తీసుకెళ్లొద్దు



ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

లక్ష్మణచాంద: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని.. డ్రైవర్లు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి ప్రమాదాలకు కారణమైతే ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి జైలుకి పంపిస్తామని హెచ్చరించారు. అనుమానితులు ఆటోల్లో ప్రయాణిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.